సమగ్ర తెలుగు దినపత్రిక

Website: www.adugunews.com

# అడుగు

The Step Towards The Truth..

హైదరాబాద్ | శుక్రవారం 10 ఏప్రిల్ 2026 | సంపుటి: 02 | సంచిక: 53 | పేజీలు: 4 | వెల: రూ.6:50

Published from Telangana, Andhra Pradesh | చీఫ్ ఎడిటర్: డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ | Mail: adugudaily@gmail.com


## ఉపాధి హామీ పనుల్లో వేగం...

**2.50 కోట్ల పనిదినాల లక్ష్యం**

**తీవ్ర కసరత్తు చేస్తున్న పంచాయితీరాజ్ శాఖ**

హైదరాబాద్, ఏప్రిల్ 9 (అడుగు న్యూస్): ఈ నెలలో ఉపాధి హామీ కూలీలకు గరిష్టంగా పని కల్పించేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తీవ్ర కసరత్తు ప్రారంభించింది. కేంద్రం తెలంగాణకు కేటాయించిన 2.50 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ

మిగతా 3లో..

## కేఎంసీలో ర్యాగింగ్ కలకలం..

**ఏడుగురు విద్యార్థులపై కఠిన చర్యలు**

హన్మకొండ, ఏప్రిల్ 9 (అడుగు న్యూస్): హనుమకొండలోని కాకతీయ మెడికల్ కళాశాల (కేఎంసీ)లో ర్యాగింగ్ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో పాల్గొన్న ఎంబీబీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులపై కళాశాల యాజమాన్యం కఠిన చర్యలు తీసుకుంది. వారికి ఆరు నెలల పాటు తరగతుల నుంచి బహిష్కరణ విధించడంతో పాటు, కోర్సు పూర్తయ్యే వరకు హాస్టల్ ప్రవేశాన్ని నిషేధించింది.

మిగతా 3లో..

# రణమా? విరమణమా?

- నేటి నుంచే అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు
- మొదటిదశ చర్చలకు ఇస్లామాబాద్ వేదిక
- అమెరికా తరపున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్
- ఇరాన్ నుంచి పార్లమెంట్ స్పీకర్ గలీ బఫ్
- మధ్యవర్తులుగా పాక్ ప్రధాని, ఆర్మీ చీఫ్




వాషింగ్టన్,ఏప్రిల్9(అడుగు న్యూస్): పాకిస్థాన్ వేదికగా అమెరికా, ఇరాన్ మధ్య తొలి దశ చర్చలకు రంగం సిద్ధమైంది. ఇస్లామాబాద్‌లో జరిగే ఈ భేటీలో ఇరుదేశాల నేతలు శాశ్వత శాంతి దిశగా చర్చలు జరపనున్నారు. ఈ భేటీలో పాల్గొనే అమెరికా ప్రతినిధుల బృందానికి ఆదేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వం వహించనున్నారు. ఈ చర్చలు ప్రధానంగా ఇరాన్ ప్రతిపాదించిన 10 అంశాల ప్రణాళిక ఆధారంగా జరగనున్నాయి. ఇరాన్‌పై ఆంక్షలు ఎత్తివేత, భవిష్యత్తులో ఇరాన్‌పై దాడులు జరగకుండా హామీ, హర్మూజ్ జలసంధిపై తమ నియంత్రణ కొనసాగాలన్న టెహ్రాన్ డిమాండ్, ఇరాన్ అణు, క్షిపణి కార్యక్రమాల భవిష్యత్తుపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చలు జరిగే అవకాశం ఉంది. తాత్కాలిక కాల్పుల విరమణను శాశ్వత శాంతి ఒప్పందంగా మార్చేందుకు చర్చలకు మధ్యవర్తిత్వం

మిగతా 2లో..



## కాళేశ్వరానికి

# మోక్షం

**మేడిగడ్డ వద్ద బేస్ క్యాంపు ఏర్పాటు**

### వెంటనే 3 బ్యారేజీలకు మరమ్మతులు

### నేనే వస్తా... పరిశీలిస్తా : సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్9(అడుగు న్యూస్): తెలంగాణలో ప్రతిష్టాత్మకమైన కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలకు మరమ్మత్తులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వీలైనంత త్వరగా కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల పనులను వేగవంతం చేయాలని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు పైన సమీక్ష నిర్వహించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మత్తుల కోసం ప్రత్యేక కార్యాచరణను తయారుచేసి, నిరంతరం పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. దీనికి సంబంధించిన ఏజెన్సీలను అప్రమత్తం చేసి పనుల్లో వేగం పెంచాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న

మిగతా 2లో..

# బీఆర్ఎస్‌లోకి జీవన్ రెడ్డి!

**జగిత్యాలలో కేటీఆర్‌తో భేటీ..**

**కాంగ్రెస్ మీకేం అన్యాయం చేసింది**

**హైదరాబాద్, జగిత్యాలలో టిపిసిసి చీఫ్, మంత్రి అడ్లూరి వ్యాఖ్యలు**



హైదరాబాద్/జగిత్యాల, ఏప్రిల్ 9 (అడుగు న్యూస్): తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పు చోటుచేసుకుంది. నాలుగు దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉన్న మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) లో చేరాలని నిర్ణయించుకున్నారు. గురువారం జగిత్యాలలోని ఆయన నివాసానికి వెళ్లిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆయనను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగిత్యాల పట్టణం గులాబీ మయమైంది.

మిగతా 2లో..

## హర్మూజ్ జలసంధిపై ఉద్రిక్తత..

- తన వైఖరి మార్చుకోనన్న ఇరాన్
- వదిలేది లేదని ట్రంప్ హెచ్చరికలు

వాషింగ్టన్/దుబాయ్, ఏప్రిల్ 9 (అడుగు న్యూస్): మధ్యప్రాచ్యంలో కీలకమైన హర్మూజ్ జలసంధి పరిణామాలు మరోసారి అంతర్జాతీయ స్థాయిలో ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. ఇరాన్ సుప్రీం నేత మొజ్తబా ఖమేనీ జలసంధి నిర్వహణను కొత్త దశకు తీసుకెళ్తామని ప్రకటించడం పరిస్థితిని మరింత సున్నితంగా మార్చింది. ఇకపై హర్మూజ్ విషయంలో ఇరాన్ మరింత వ్యూహాత్మకంగా, కఠినంగా వ్యవహరిస్తుందని ఆయన సంకేతాలు ఇచ్చారు. అమెరికా-ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినా, జలసంధిలో ఉద్రిక్తతలు తగ్గలేదు. ఇరాన్ యుద్ధాన్ని కోరుకోవడం లేదని ఖమేనీ స్పష్టం చేసినప్పటికీ, తమ హక్కులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోమని తెలిపారు. దాడుల్లో తమ నాయకత్వానికి జరిగిన నష్టాలకు ప్రతీకారం తీర్చుకుంటామని, యుద్ధంలో ఇరాన్ విజయం సాధించిందని కూడా పేర్కొన్నారు. అలాగే జరిగిన నష్టాలకు

మిగతా 2లో..

## మహిళా, పునర్విభజన.. బిల్లులు సిద్ధం.. మద్దతే రాద్ధాంతం!

- అందరూ సహకరించాలి : ప్రధాని మోదీ
- బిల్లులపై ఏం చేద్దాం? : నేడు సీడబ్ల్యూసీ భేటీ
- అన్ని భాగస్వామ్య పక్షాలకు కాంగ్రెస్ పిలుపు
- నేడు ఢిల్లీ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ,ఏప్రిల్9(అడుగు న్యూస్): పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల చట్ట సవరణ బిల్లుకు కౌంట్‌డౌన్ ప్రారంభమయ్యింది. విపక్షాలు బిల్లుకు సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ 16,17,18 తేదీల్లో జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు అన్ని పార్టీల పార్లమెంటు సభ్యులు హాజరై ఏకగ్రీవంగా బిల్లును ఆమోదించాలని ప్రధాని మోదీ కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు అన్ని పార్టీలు మద్దతివ్వాలని ప్రధాని మోదీ కోరారు. ఏప్రిల్ 16,17,18 తేదీల్లో జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు అన్ని పార్టీల ఎంపీలు హాజరు

మిగతా 2లో..



## 'సానుభూతి'పై నిఘా!

**ఎన్ఐఏ చర్యలపై ప్రజాసంఘాల ఆగ్రహం**

హైదరాబాద్, ఏప్రిల్ 9 (అడుగు న్యూస్): మావోయిస్టుల పట్ల సానుభూతి వ్యక్తం చేస్తున్నారన్న ఆరోపణలతో కవులు, కళాకారులు, మేధావులపై కేంద్ర సంస్థలు చర్యలు వేగవంతం చేయడం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. దాదాపు 200 మందికి పైగా వ్యక్తులపై నిఘా పెట్టి వారి కార్యకలాపాలు, సోషల్ మీడియా పోస్టులను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ చర్యలు మరింత వేగం పుంజుకున్నాయని ప్రజాసంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మావోయిస్టు అంత్యక్రియలకు హాజరై ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడారనే కారణంతో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కేసులు నమోదు చేసి పలువురికి

మిగతా 2లో..

# పొంగులేటి.. పొగరులేటి!

- పేలుతాయన్న బాంబులేటి!!
- అవినీతి రూపుమాపునకు నానా తంటాలు:హరీశ్ రావు



వనపర్తి, ఏప్రిల్ 9 (అడుగు న్యూస్) వనపర్తి జిల్లాలో పర్యటించిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. పొంగులేటి వ్యాఖ్యలు పొగరుగా ఉన్నాయని, గతంలో చెప్పిన "బాంబులు" తుస్సుమన్నాయని ఎద్దేవా చేశారు. క్రషర్ వ్యవహారంలో అవినీతి జరిగినట్లు స్వయంగా సీఎం పేర్కొన్నారని గుర్తుచేస్తూ, అధికారులు రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అనుమతుల్లేవని నోటీసులు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. మరి సీఎం చెప్పిందేనా నిజం, లేక మంత్రి

మిగతా 3లో..

# రికార్డు పోలింగ్!

- 89.80%తో పుదుచ్చేరి టాప్
- అసోం, కేరళంలో భారీగా పోలింగ్
- మూడు రాష్ట్రాల ఫలితాలపై ఉత్కంఠ



న్యూఢిల్లీ,ఏప్రిల్ 9(అడుగు న్యూస్): అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ జరిగింది. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ఇసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది.

మిగతా 2లో..



# అమరావతిని ఎవరు ఆపలేరు

- వైసీపీ అంటేనే విధ్వంసం.. జగన్‌పై తీవ్ర విమర్శలు
- బాపట్ల జిల్లా పర్యటనలో సీఎం చంద్రబాబు

బాపట్ల, ఏప్రిల్ 9 (అడుగు న్యూస్): బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని సూరేపల్లి గ్రామసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా అమరావతినే రాజధానిగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు విధ్వంసం చేసి, విపక్షంలో బెదిరింపులకు దిగడం జగన్ స్వభావమని విమర్శించారు. రాజధాని విషయంలో మూడు ముక్కలాటల నుంచి మావిగన్ వరకు మారుతున్న విధానాలను ఎద్దేవా చేశారు. వెయ్యిమంది అడ్డొచ్చినా అమరావతిని ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. అమరావతి ఉద్యమ సమయంలో మహిళలపై జరిగిన ఘటనలను ప్రస్తావిస్తూ జగన్‌కు నైతిక హక్కు లేదన్నారు. మీడియాపై, ముఖ్యంగా ఆంధ్రజ్యోతి పై జరుగుతున్న దాడులను ఖండించారు. చట్టమే తగిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

మిగతా 3లో..

## యుద్ధం వాస్తవాలు: చర్చల్లో కీలకాంశాలు!

పశ్చిమాసియా యుద్ధ తీవ్రత చర్చల అంకానికి చేరుకుంది. రెండు వారాల కాల్పుల విరమణ ప్రకటన తర్వాత నేటి నుంచే ఇస్లామాబాద్ లో చర్చలు ప్రారంభం కానున్నాయి. యుద్ధం ప్రారంభం కంటే విరమణే విపరీతంగా మారింది. పెను సవాల్ గా నిలిచింది. ఈ దశలో మెదలైన చర్చలు ఏ ఫలితాలనివ్వనున్నాయి? పరస్పర ప్రయోజనాల కంటే ప్రశాంతతవైపా? లేక స్వప్రయోజనాల వైపా?

**డా. మార్గం-అడుగు**

ఎడిటోరియల్ 2వ పేజీలో

అడుగు
The Step Towards The Truth..

## సంపాదకీయం
### మార్గం - అడుగు



### యుద్ధం వాస్తవాలు: చర్చల్లో కీలకాంశాలు!

లిపశ్చిమాసియా యుద్ధ తీవ్రత చర్చల అంకానికి చేరుకుంది. రెండు వారాల కాల్పుల విరమణ ప్రకటన తర్వాత నేటి నుంచే ఇస్లామాబాద్ లో చర్చలు ప్రారంభం కానున్నాయి. యుద్ధం ప్రారంభం కంటే విరమణే విపరీతంగా మారింది. పెను సవాల్ గా నిలిచింది. ఈ దశలో మెదలైన చర్చలు ఏ ఫలితాలనివ్వనున్నాయి? పరస్పర ప్రయోజనాల కంటే ప్రశాంతతవైపా? లేక స్వప్రయోజనాల వైపా? అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజమిన్ నెలన్యాహు విధానాలపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే భావోద్వేగాలకంటే వాస్తవాలు, గణాంకాలు, ధృవీకరించబడిన సమాచారం ఆధారంగా ఈ పరిస్థితిని అర్థం చేసుకోవడం అవసరం.

ఇరాన్‌పై అమెరికా--ఇజ్రాయెల్ సంయుక్తంగా పూర్తి స్థాయి యుద్ధం ప్రారంభించాయన్న వాదనకు ప్రస్తుతానికి నిర్ధారిత ఆధారాలు లేవు. వాస్తవానికి, అమెరికా, ఇజ్రాయెల్- ఇరాన్ పై ప్రత్యక్ష యుద్ధం కంటే "పరోక్ష వ్యూహాలు" ను ఎక్కువగా అనుసరిస్తున్నాయి. ఉదాహరణకు, ఆంక్షలు, సైబర్ దాడులు, ప్రాంతీయ మిత్ర బలగాల ద్వారా ఒత్తిడి వంటి చర్యలు కొనసాగుతున్నాయి.

అణ్వాయుధాలు ఈ యుద్ధానికి, ఉద్రిక్తతలకు కేంద్ర బిందువు. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ నివేదికల ప్రకారం, ఇరాన్ వద్ద 2024 నాటికి 120--150 కిలోల 60% శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఉన్నట్లు అంచనా. ఇది ఆయుధస్థాయి (90%) కంటే తక్కువైనా, వేగంగా పెంచే సామర్థ్యం ఉన్నందున పాశ్చాత్య దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే "యురేనియంను స్వాధీనం చేసుకోవడం కోసం యుద్ధం" అనే వాదనకు ప్రత్యక్ష ఆధారాలు లేవు.

ఇరాన్ సుప్రీం అలీ ఖమేనీ ఇంకా అధికారంలోనే ఉన్నారు. ఆయన మరణం, వారసత్వ మార్పులపై వస్తున్న వార్తలు ఊహాగానాలకే పరిమితం. ఇరాన్ రాజకీయ వ్యవస్థలో సుప్రీం లీడర్ పాత్ర కీలకం కావడంతో, అలాంటి మార్పులు జరిగితే అవి ప్రపంచవ్యాప్తంగా స్పష్టంగా నమోదవుతాయి.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన మరో అంశం స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్. ప్రపంచ చమురు రవాణాలో 20% ఈ జలసంధి గుండా జరుగుతుంది. రోజుకు 17--20 మిలియన్ బ్యారెల్స్ చమురు ఈ మార్గంలో సరఫరా అవుతుంది. ఇరాన్ ఈ ప్రాంతంపై ప్రభావం చూపగలిగినప్పటికీ, దీన్ని పూర్తిగా మూసివేయడం అంత సులభం కాదు. అలాంటి చర్య ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలను ఒక్కసారిగా 20--30% పెంచే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

గల్ఫ్ ప్రాంత భద్రత కూడా ఈ నేపథ్యంలో కీలక అంశం. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాలు గతంలో డ్రోన్, క్షిపణి దాడులను ఎదుర్కొన్నాయి. 2019లో సౌదీ అరేబియాలోని అబ్కైక్ ఆయిల్ సదుపాయాలపై జరిగిన దాడి ప్రపంచ చమురు సరఫరాలో తాత్కాలికంగా 5% అంతరాయం కలిగించింది. అయితే "వందల సంఖ్యలో క్షిపణులు, వేల డ్రోన్లు" అన్న వాదనలు ప్రస్తుత పరిస్థితుల్లో అతిశయోక్తిగా కనిపిస్తున్నాయి.

అమెరికా సైనిక శక్తిపై కూడా చర్చ అవసరం. అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద రక్షణ బడ్జెట్ కలిగిన దేశం. 2024లో దాదాపు 880 బిలియన్ డాలర్ల రక్షణ వ్యయం చేసింది. అయినప్పటికీ, మధ్యప్రాచ్యంలోని సంక్లిష్ట రాజకీయ పరిస్థితుల్లో పూర్తి స్థాయి యుద్ధానికి దిగడం అంటే భారీ ఆర్థిక, రాజకీయ ప్రమాదాల్లోకి కూరుకుపోవడమే. ఇదే కారణంగా అమెరికా "నియంత్రిత ప్రతిస్పందన" విధానాన్ని అనుసరిస్తోంది.

ఇరాన్ విషయానికి వస్తే, అది సైనికంగా, వ్యూహాత్మకంగా ప్రతిఘటన చూపగలిగే దేశం. హెజ్బుల్లా, హౌతీస్ వంటి గ్రూపుల ద్వారా ప్రభావం చూపుతోంది. అయితే ఆర్థికంగా అది తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. అంతర్జాతీయ ఆంక్షల కారణంగా దాని జీడీపీ వృద్ధి మందగించింది, ద్రవ్యోల్బణం 30--40% మధ్య ఊగిసలాడుతోంది.

"పూర్తి యుద్ధం -- సంపూర్ణ విజయం లేదా ఓటమి" అనే సాదాసీదా కథనం ఈ ప్రాంతానికి వర్తించదు. ఇది బహుళస్థాయి శక్తి పోరు. ఇరాన్ తన ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుండగా, అమెరికా--ఇజ్రాయెల్ తమ భద్రతా ప్రయోజనాలను రక్షించుకోవడానికి చర్యలు తీసుకుంటున్నాయి.

సమాచార యుగంలో ప్రచారం, అపోహలు కూడా యుద్ధం అంతే ప్రభావం చూపగలవు. అందుకే ప్రతి వాదనను గణాంకాలు, విశ్వసనీయ నివేదికలతో సమీక్షించడం అవసరం. భావోద్వేగాల కంటే వాస్తవాలు ముఖ్యం. అప్పుడే ఈ సంక్లిష్ట ప్రపంచ రాజకీయాలను సరైన దిశలో అర్థం చేసుకోవచ్చు.

# కాళేశ్వరానికి మోక్షం

మొదటిపేజీ తరువాయి..

పరీక్షలు, నమూనాల సేకరణ ప్రక్రియను వర్షాకాలం మొదలడానికి ముందే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖ , సీడబ్ల్యూపీఆర్ఎస్, కాళేశ్వరం ప్రాజెక్టు 3 బ్యారేజీల నిర్మాణ సంస్థలు, డిజైన్ కన్సల్టేషన్స్ తో టీమ్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రతి పని లో సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యులు ఉండేలా చూడాలన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో కుంగిపోయిన పిల్లరే కాకుండా మొత్తం 1.6 కిలోమీటర్ల బ్యారేజ్ ని పూర్తిగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని ఇంజనీర్లు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. మేడిగడ్డ దగ్గర 500 బోరు బావులు తవ్వాల్సి ఉందని, అందుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోవసం అవసరమైన మేషిన్లను ఏర్పాటు చేసుకుని సంసిద్ధం కావాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. వీలైనంత త్వరగా ఈ పని పూర్తి చేయాలన్నారు. ముందుకు బ్యారేజీల మరమ్మతులకు సంబంధించి డిజైన్ లు సిద్ధం చేయాలని, డిసెంబరు వరకు చేయాల్సిన పనులపైన పూర్తి షెడ్యూల్ సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కాలళేశ్వరం ప్రాజెక్టు పనులలో జాప్యం జరగడానికి వీలు లేదని పేర్కొన్న సీఎం రేవంత్ నిధుల విషయంలో ఇబ్బంది లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. మేడిగడ్డ వద్ద బేస్ క్యాంపు ఏర్పాటు చేయాలని, పనులు ప్రారంభం అయ్యాక తాను స్వయంగా వచ్చి పరిశీలిస్తానని ఆయన తెలిపారు. సొరంగాల నిపుణుడు పరీక్షిత్ మెహ్రా పనుల తీరుపై ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కావాలనే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి, దాన్ని బీఆర్ఎస్ లోపంగా చూపాలని యత్నిస్తోందని మాజీ మంత్రి హరీష్ రావు పలుమార్లు ఆరోపించారు. తాజాగా ప్రాజెక్టు రిపేర్ పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని రైతులకు, ఆ ప్రాంత ప్రజలకు శుభవార్త చెప్పింది. సీఎం రేవంత్ రెడ్డి ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కాళేశ్వరం ప్రాజెక్టుపై నిర్వహించిన సమీక్షా ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం కార్యదర్శి మానిక్ రాజ్, నీటిపారుదలశాఖ ఓఎస్డీ భీం ప్రసాద్, సీఈలు శ్రీనివాస్ గుప్తా, ప్రసాద్, ఇరిగేషన్ సెక్రటరీ శ్రీధర్, ఈఎన్సీ రమేష్, జేఎస్ శ్రీనివాస్, నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రికార్డు పోలింగ్!

మొదటిపేజీ తరువాయి..

గురువారం సాయంత్రం 5 గంటలకు ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ ముగిసింది. ఇప్పటి వరకు పుదుచ్చేరిలో 86.92 శాతం, అసోంలో 84.42 శాతం, కేరళంలో 75.01 శాతం పోలింగ్ నమోదు అయిందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. గురువారం ఉదయం అసోం (126), కేరళం (140), పుదుచ్చేరి (30) లలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. ఈ ఎన్నికల పోలింగ్ వేళ.. ఏర్పాట్లను ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఆయా రాష్ట్రాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా భద్రతా సిబ్బందిని మోహరించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. మొత్తం 296 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కేరళ, పుదుచ్చేరిలలో సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగియగా.. అస్సాంలో ఐదు గంటలకే పూర్తయ్యింది. మూడు ప్రాంతాల్లోనూ ఈసారి భారీ సంఖ్యలో ఓటర్లు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేరళలోని 140 నియోజకవర్గాల్లో 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. పోలింగ్ బూత్‌లకు భారీగా తరలివచ్చారు. సాయంత్రం 5గంటల వరకు 75శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి కోయ్‌కోడ్‌లో అత్యధికంగా 77శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో రాష్ట్రంలో 74.06శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి స్వల్పంగా పెరిగింది. అస్సాంలో 126 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో 2.5 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. సాయంత్రం 5గంటల వరకు 84శాతానికిపైగా పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో 82శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి మరింత పెరిగింది. దల్‌గావ్‌లో అత్యధికంగా 94.57శాతం పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరిలోనూ భారీ సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ మొత్తం 30 అసెంబ్లీ స్థానాలుండగా.. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగిసింది. ఐదు గంటల వరకే 86శాతం పోలింగ్ నమోదు కాగా.. ఇది మరింత పెరగనుంది. పోలింగ్ సమయం ముగిసినప్పటికీ.. అప్పటికే పోలింగ్ కేంద్రాల్లో క్యూ లైన్‌లలో ఉన్నవారికి టోకెన్లు ఇచ్చి పోలింగ్‌కు అనుమతించినట్లు సమాచారం. ఈ ఏడాది మార్చి రెండో వారంలో దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని అసెంబ్లీలకు కేంద్రం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకటించింది. అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీలకు ఏప్రిల్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపింది. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23వ తేదీన ఒక దశలో ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని వెల్లడించింది. పశ్చిమ బెంగాల్‌లోని 294 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని పేర్కొంది. మే 4వ తేదీన ఈ ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు పక్రియ చేపట్టడతామని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.



# బీఆర్ఎస్‌లోకి జీవన్ రెడ్డి!

మొదటిపేజీ తరువాయి..

**రాష్ట్రం కోసం కేసీఆర్‌తో కలిసి పనిచేస్తా: జీవన్ రెడ్డి**

బీఆర్ఎస్‌లో చేరికపై జీవన్ రెడ్డి మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత 27 నెలలుగా కాంగ్రెస్ పార్టీలో తీవ్రమైన మానసిక క్షోభ, అవమానాలు ఎదుర్కొన్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన కంటే కేసీఆర్ పాలనే ఎంతో మెరుగ్గా ఉంది. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రం తిరోగమన దిశలో పయనిస్తోంది. జాతీయ స్థాయిలో బీజేపీ, రాష్ట్రంలో కేసీఆర్ మాత్రమే మేలైన నాయకులని ప్రజలు భావిస్తున్నారు అని ఆయన పేర్కొన్నారు. రైతు సంక్షేమం, తెలంగాణ ఏర్పాటులో కేసీఆర్ పాత్రను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.

**జీవన్ రెడ్డి నిబద్ధత గల నేత: కేటీఆర్ ప్రశంసలు**

జీవన్ రెడ్డిని 'నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం'గా కేటీఆర్ అభివర్ణించారు. కేసీఆర్‌కు, జీవన్ రెడ్డికి మధ్య దశాబ్దాల నాటి స్నేహం ఉందని, అసెంబ్లీలో ఆయన ప్రజల కోసం గట్టిగా గొంతు వినిపించేవారని గుర్తు చేశారు. 2014లోనే ఆయనను పార్టీలోకి ఆహ్వానించామని, కానీ విలువలతో కూడిన రాజకీయం చేసే ఆయన అప్పట్లో పార్టీ మారలేదని కేటీఆర్ చెప్పారు. జగిత్యాల నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు బీఆర్ఎస్ కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.

**జీవన్ రెడ్డిపై కాంగ్రెస్ ఎదురుదాడి:**

మరోవైపు, జీవన్ రెడ్డి నిర్ణయాన్ని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తప్పుపట్టారు. వీరు ఇరువురు గురువారం హైదరాబాద్, జగిత్యాలలో వేరు వేరుగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆయనకు 14 సార్లు బీ-ఫామ్ ఇచ్చి గౌరవించిందని, ఇప్పుడు ఆ పార్టీనే విమర్శించడం సరికాదని అన్నారు. గతంలో కేసీఆర్ అవినీతిని విమర్శించిన జీవన్ రెడ్డి, ఇప్పుడు అదే పార్టీలో ఎలా చేరుతారని ప్రశ్నించారు. ఈ నెల 13న జీవన్ రెడ్డి అధికారికంగా బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోనున్నారు.

# రణమా? విరమణమా?

మొదటిపేజీ తరువాయి..

వహిస్తున్న పాక్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది.ఇందుకోసం పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. శాంతి చర్చలకు మద్దతు కూడగట్టేందుకు ఇప్పటికే సౌదీ అరేబియా, కెనడా, కువైట్ విదేశాంగ మంత్రులతో సంప్రదింపులు జరిపారు.అయితే, భేటీ దృష్ట్యా ఇస్లామాబాద్ నగరమంతా పాక్ ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది.



పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేసిన అధికారులు గురువారం, శుక్రవారం రెండ్రోజులు పాటు స్థానికంగా సెలవులు ప్రకటించారు. ఇప్పటికే 30 మంది సభ్యులతో కూడిన అమెరికా భద్రతా బృందాలు ఇస్లామాబాద్‌కు చేరుకొని ఏర్పాట్లను సమీక్షించాయి. అటు ఈ భేటీ కోసం ప్రపంచదేశాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఈ చర్చలు సఫలమైతే పశ్చిమాసియాలో శాంతి నెలకొంటుంది.అసలైన ఒప్పందం అమలు చేసే వరకూ అమెరికా సైన్యం ఇరాన్ సరిహద్దుల్లోనే ఉంటుందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు. అమెరికా నౌకలు, విమానాలు, సైనిక సిబ్బందితో పాటు అదనపు మందుగుండు సామగ్రి, ఆయుధాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ఇప్పటికే గణనీయంగా బలహీనపడిన శత్రువును అవసరమైతే పూర్తిగా నాశనం చేయడానికి ఏం చేసేందుకైనా సిద్ధమని పేర్కొన్నారు. ఇరాన్ ఒప్పందాన్ని ఉల్లంఘించే అవకాశం చాలా తక్కువని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాలను సమకూర్చుకునేందుకు ఒప్పుకునేదిలేదని స్పష్టంచేశారు. హర్మూజ్‌ను తెరవాల్సిందేనని ట్రంప్ స్పష్టంచేశారు. అటు హెజ్‌బొల్లాపై దాడులను ఆపాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. వారిపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగితే బలమైన ప్రతిస్పందనలు ఉంటాయని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ హెచ్చరించారు. తాత్కాలిక ఒప్పందం లెబనాన్‌కు కూడా వర్తిస్తుందని స్పష్టం చేశారు. అయితే దీనిని అమెరికా, ఇజ్రాయెల్‌లు ఖండిస్తున్నాయి. మరోవైపు, సీజ్ ఫైర్ గురించి పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌లు తనతో చర్చలు జరిపారని, ఇరాన్‌పై దాడులు నిలిపివేయాలని తనను కోరారని ట్రంప్ ఇదివరకే స్పష్టం చేశారు.

# మహిళా, పునర్విభజన..
## బిల్లులు సిద్ధం.. మద్దతే రాద్ధాంతం!

మొదటిపేజీ తరువాయి..

కావాలని మోదీ విజ్ఞప్తి చేశారు. మహిళా బిల్లు ఆమోదానికి ఏకాభిప్రాయ సాధన కోసం -- కృషిచేయాలంటూ అన్ని రాజకీయ పక్షాలకు ప్రధాని పిలుపునిచ్చారు. ఈ మార్పులు భారతదేశవ్యాప్తంగా ఉన్న మహిళల ఆకాంక్షలను ప్రతిబింబిస్తున్నాయని, వీటిని కేవలం శాసనపరమైన ప్రక్రియ అని పిలవడం తక్కువ చేసి చెప్పడమే అవుతుందని అన్నారు. అంతేకాకుండా, ఇది భారతదేశ నాగరికతా స్ఫూర్తికి ఎప్పటినుంచో మార్గదర్శకంగా ఉన్న ఒక సూత్రానికి ధృవీకరణ అని ఆయన అన్నారు. భారతదేశ జనాభాలో సగం మంది మహిళలేనని, దేశ అభివృద్ధిలో వారు కీలక పాత్ర పోషించారని పేర్కొంటూ, వారి సాధికారత కోసం నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. మెరుగైన విద్య, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు, ఆర్థిక సహాయం అందించడం వల్ల ఆర్థిక, సామాజిక జీవితంలో మహిళల భాగస్వామ్యానికి పునాదులు మరింత బలపడ్డాయని ఆయన అన్నారు. సమాజంలో మహిళల పాత్రకు అనుగుణంగా రాజకీయాలు, శాసనసభలలో వారి భాగస్వామ్యం లేకపోవడం దురదృష్టకరమని ప్రధానమంత్రి భావితరాల కోసం మహిళా రిజర్వేషన్ బిల్లు అన్నారు మోదీ. వికసిత్ భారత్ లక్ష్యం సాధించాలంటే మాతృశక్తిని, నారీశక్తిని పూర్తిస్థాయిలో పటిష్ఠం చేయాలని మోదీ వీడియో సందేశం జారీ చేశారు. ప్రజాస్వామ్యం కాలక్రమేణా మరింత సమ్మిళితం అవుతుందని ఇలాంటి సందర్భాలు చాటిచెబుతాయన్నారు. ఇది సాధారణ శాసన ప్రక్రియ కాదన్నారు. దేశంలో కోట్లమంది మహిళల ఆకాంక్షలకు ప్రతిరూపమని అన్నారు. "కమిటీలు ఏర్పాటు చేశారు, బిల్లు ముసాయిదాలు ప్రవేశపెట్టారు కానీ అవి ఎన్నడూ కార్యరూపం దాల్చలేదు," అని ప్రధాని మోదీ అన్నారు. "కానీ శాసనసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలనే విస్తృత ఏకాభిప్రాయం అలాగే నిలిచి ఉంది. సెప్టెంబర్ 2023లో, పార్లమెంట్ అదే ఏకాభిప్రాయ స్ఫూర్తితో నారీ శక్తి వందన అధినియమ్‌ను ఆమోదించింది. నేను దానిని నా జీవితంలోని అత్యంత ప్రత్యేకమైన సందర్భాలలో ఒకటిగా భావిస్తాను." అని ప్రధానమంత్రి తన వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఇదిలావుంటే, 2023లో కూడా పార్లమెంట్ ఉభయసభలు మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాయి. లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 నుంచి 816కి



పెంచి, వాటిలో 273 స్థానాలను మహిళలకు కేటాయించడానికి వీలుగా మహిళా రిజర్వేషన్ చట్టంలో మార్పులు చేస్తున్నారు. 2011 జనాభా ఆధారంగా మహిళకు రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్రం రాజ్యాంగ సవరణ బిల్లును తెస్తోంది. బిల్లులో కొన్ని మార్పులు చేయాలని విపక్షాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా ఓబీసీ , ముస్లిం, ఎస్సీ,ఎస్టీ వర్గాల మహిళలకు కోటా కల్పించాలని కోరుతున్నాయి. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసంపై కాంగ్రెస్ పార్టీ కూడా కీలక చర్చలు జరుపుతోంది. శుక్రవారం (ఏప్రిల్ 10) కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు డీలిమిటేషన్‌పై చర్చిస్తారు.

# 'సానుభూతి'పై నిఘా!

మొదటిపేజీ తరువాయి..

నోటీసులు జారీ చేస్తోంది. ఈ క్రమంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నేత పోటు రంగారావును విచారణకు హాజరు కావాలని ఆదేశించింది.

ఇప్పటికే గాదె ఇన్నయ్యను అరెస్టు చేయగా, ప్రముఖ కవి నందిని సిద్ధారెడ్డి, పౌరహక్కుల నేత గడ్డం లక్ష్మణ్, దేవీ ప్రసాద్, రవిచందర్‌లను విచారించారు. అవసరమైతే మళ్లీ విచారణకు పిలుస్తామని అధికారులు సూచించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా గతంలో విప్లవ భావజాలంతో ఉన్నవారు, ప్రస్తుతం చట్టబద్ధంగా పనిచేస్తున్నవారిపై కూడా నిఘా పెంచినట్లు సమాచారం. సోషల్ మీడియాలో మావోయిస్టులకు అనుకూలంగా పోస్టులు, కామెంట్లు, షేర్లు చేసిన వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.ఇదే సమయంలో శాతవాహన విశ్వవిద్యాలయంలో దళిత ప్రొఫెసర్ సూరెపల్లి సుజాత, విద్యార్థి కరికె మహేశ్‌లను 'అర్బన్ నక్సల్స్'గా చిత్రీకరిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆరోపించింది. నిరాధార ఆరోపణలతో వారిపై కక్షపూరిత చర్యలు తీసుకోవడం ఆపాలని, యూనివర్సిటీ అకడమిక్ వాతావరణాన్ని కాపాడాలని కమిటీ డిమాండ్ చేసింది. మొత్తం మీద ఈ పరిణామాలు రాష్ట్రంలో స్వేచ్ఛ, హక్కులపై చర్చకు దారితీస్తున్నాయి.

# హర్మూజ్ జలసంధిపై ఉద్రిక్తత..

మొదటిపేజీ తరువాయి..

పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇక అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హర్మూజ్ జలసంధి గుండా వెళ్లే చమురు ట్యాంకర్లపై ఇరాన్ టోల్ వసూలు చేస్తోందన్న వార్తలను ప్రస్తావిస్తూ, అలాంటి చర్యలు వెంటనే నిలిపివేయాలని హెచ్చరించారు. ఇరాన్ సహకరించినా లేకపోయినా చమురు సరఫరా పునఃప్రారంభం అవుతుందని ట్రంప్ స్పష్టం చేశారు. మొత్తంగా హర్మూజ్ జలసంధి పరిస్థితులు ప్రపంచ చమురు మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# డీఈఓకు గుండెపోటు..

అనంతపురం, ఏప్రిల్ 9 (అడుగు న్యూస్):
అనంతపురం జిల్లా డీఈఓ కడప ప్రసాద్ బాబు గుండెపోటుకు గురయ్యారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల స్పాట్ వాల్యుయేషన్ డ్యూటీలో ఉండగా అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు.



వెంటనే సహోద్యోగులు నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షల్లో గుండె నాళంలో బ్లాక్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స కొనసాగుతుండగా, త్వరలో స్టెంట్ వేయనున్నట్లు తెలిపారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్య బృందం వెల్లడించింది. కుటుంబ సభ్యులు చేరుకుని పర్యవేక్షిస్తున్నారు. ఎప్పుడూ అందరితో స్నేహపూర్వకంగా ఉండే ప్రసాద్ బాబు త్వరగా కోలుకోవాలని సహచరులు, స్నేహితులు ఆకాంక్షిస్తున్నారు.

# అభినందనలు

దేవరుప్పుల, ఏప్రిల్ 9 (అడుగు న్యూస్):
జనగామ జిల్లా, దేవరుప్పుల మండలం, కడవెండి గ్రామంలో దొడ్డి మంగమ్మ--వెంకటయ్య కుమారుడు ప్రశాంత్, అంకితల వివాహ



వేడుక ఘనంగా జరగగా, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. దాంపత్య జీవితం సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బస్వ మల్లేశం, గ్రామ పార్టీ అధ్యక్షుడు తాటిపెల్లి మహేష్, సర్పంచ్ భాషిపాక రాములు, సుడిగెల హనుమంతు, ఏరువ రైఫిల్ రెడ్డి, ఆవుల వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# రాయపర్తి మండలంలో ఉద్రిక్తత

రాయపర్తి, ఏప్రిల్ 9 (అడుగు న్యూస్):
వరంగల్ జిల్లా,:రాయపర్తి మండల పరిధిలోని ఏకే తండాలో గ్యాంగ్ రేప్ ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఏకే తండాకు చెందిన 21



ఏళ్ల యువతిని రావూరు తండాకు చెందిన నలుగురు యువకులు అత్యాచారం చేసి హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తీవ్ర రక్తస్రావంతో యువతి మృతి చెందగా, మృతదేహాన్ని వర్ధన్నపేట మార్చురీకి తరలించారు. పోలీసులు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించడం లేదని ఆగ్రహించిన కుటుంబ సభ్యులు మార్చురీ ముందు జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. నిందితులు ఎప్పుడూ గంజాయి మత్తులో ఉండేవారని బంధువులు చెబుతున్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి న్యాయం చేయాలని, అప్పటి వరకు పోస్టుమార్టం నిర్వహించనివ్వమని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# ఆరోగ్య శిబిరం విజయవంతం

పాలకుర్తి, ఏప్రిల్ 9 (అడుగు న్యూస్):
పాలకుర్తి మేజర్ గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్సిడి) ఆరోగ్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో



గ్రామ ప్రజలకు బి.పి, షుగర్, గుండె సంబంధిత వ్యాధుల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సర్పంచ్ ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాదెపాక కిరణ్, పంచాయతీ కార్యదర్శి రుబీనా సుల్తానా, వైద్యులు, వార్డు సభ్యులు కామారపు సునీల్, కమ్మగాని సుధాకర్, నెమరుగోమ్ముల శ్రీనివాసరావు, కమ్మగాని శ్రీకాంత్ గౌడ్, కత్తి దస్తగిరి, వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యకు పరిష్కారం

పాలకుర్తి, ఏప్రిల్ 9 (అడుగు న్యూస్):
జనగామ జిల్లా, పాలకుర్తి మండలం, మైలారం గ్రామంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు సర్పంచ్ గూగులోత్ విమల జీవన్లాల్ ఆధ్వర్యంలో శాశ్వత పరిష్కారం లభించింది. గ్రామ పంచాయతీ నిధులతో కొత్త బోరు తవ్వించి, మోటార్ ఏర్పాటు చేయడంతో ప్రజలు



హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని పాలకవర్గం స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజశేఖర్, సెక్రటరీ శైలజ, వార్డు సభ్యులు స్వాతి యాకేష్, బద్రి బాలు, సుగుణమ్మ హథీరాం తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిని ఎవరు ఆపలేరు

మొదటిపేజీ తరువాయి..

'మీ భూమి మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందజేస్తూ భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రీ సర్వే ద్వారా ప్రతి రైతుకు భద్రతతో కూడిన పాసు పుస్తకాలు అందిస్తామని, వాటికి క్యూఆర్ కోడ్, డిజిటల్ లాకర్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు.
'మీ ఇంటి జాగా -- మీ హక్కు' అనే కొత్త కార్యక్రమాన్ని కూడా త్వరలో ప్రారంభిస్తామని ప్రకటించారు. కుటుంబ ఆస్తి వివాదాలు తగ్గించుకోవాలని ప్రజలకు సూచించారు. పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి దేశానికి అంకితం చేస్తామని తెలిపారు. సూర్యలంక బీచ్‌ను గోవాను మించిపోయే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు.
సభలో రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడిన సీఎం, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార హామీ ఇచ్చారు. గతంలో ఎదురైన ఇబ్బందులు తొలగి ఇప్పుడు న్యాయం జరుగుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. మొత్తం మీద సభలో చంద్రబాబు ప్రసంగం రాజకీయంగా వేడెక్కగా, అభివృద్ధి, సంక్షేమంపై తన దృక్పథాన్ని స్పష్టంగా వెల్లడించారు

# పొంగులేటి.. పొగరులేటి!

మొదటిపేజీ తరువాయి..

మాటలేనా అని ప్రశ్నించారు.నాదర్‌గుల్ భూములు ప్రభుత్వానివైతే హైడ్రా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. ప్రభుత్వ భూములపై అక్రమణలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్న రైతులకు సంఘీభావం తెలిపిన ఆయన, అవసరం లేని ప్రాజెక్టులు ఎందుకు చేపడుతున్నారని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు బీఆర్ఎస్ హయాంలో 80 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు చేయడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతు బంధు, రుణమాఫీ వంటి హామీలు అమలు కాలేదని ఆరోపిస్తూ, కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# గోదావరి పుష్కరాల్లో ప్రత్యేక సదుపాయాలు

### పుష్కరాల ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

హైదరాబాద్,ఏప్రిల్ 9(అడుగు న్యూస్):
రానున్న గోదావరి నదీ పుష్కరాలకు హాజరయ్యే భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశించారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై గురువారం సచివాలయంలో సమావేశం జరిగింది. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంత రావు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, నిజామాబాద్ కందకుర్తి నుండి బాసర, భద్రాచలం వరకు 8 జిల్లాల్లో గోదావరి నదీ పరివాహక ప్రాంతం ఉందని, ఈ జిల్లాల్లో పుష్కర స్నానాలకై పెద్ద సంఖ్యలో ప్రజానీకం వచ్చే అవకాశం ఉన్నందున పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ పుష్కర ఏర్పాట్లపై ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రిగారు తగు సూచనలు చేశారని, వారి ఆదేశాలకు అనుగుణంగా పుష్కర ఏర్పాట్లపై తగు ప్రతిపాదనలను రూపొందించి, గోదావరి పుష్కరాలపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీకి సమర్పించాలని సూచించారు. పుష్కర ఏర్పాట్లపై చేపట్టాల్సిన పనులపై ఇప్పటికే నియమించిన ఈ.ఎన్.సి.లు, చీఫ్ ఇంజనీర్ల కమిటీ ప్రతిపాదిత పుష్కర పనులను పరిశీలించాలని సూచించారు.

# నగరంలో ట్రాఫిక్ చిక్కుల ముడివిప్పే ప్రయత్నం

## షేక్‌పేట నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు మోడల్ కారిడార్

## బస్సులో ప్రయాణించి పరిస్థితులు అధ్యయనం చేసిన అధికారులు

హైదరాబాద్,ఏప్రిల్9(అడుగు న్యూస్):
భాగ్యనగరంలోని కీలకమైన షేక్‌పేట్ ఫ్లై ఓవర్ నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు ట్రాఫిక్ కష్టాలను తీర్చి, ఈ మార్గాన్ని 'మోడల్ కారిడార్'గా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. అధికారులందరూ కలిసి ఒకే బస్సులో ప్రయాణిస్తూ.. మార్గమధ్యలో ఉన్న బాటిల్ నెక్‌లు , నీరు నిలిచే ప్రాంతాలు, ఆక్రమణలను స్వయంగా పరిశీలించి తక్షణ పరిష్కార మార్గాలను సూచించారు. ఎన్‌డిఐ హాస్పిటల్ వద్ద, బృందావన్ కాలనీ రోడ్ నంబర్-1 వద్ద కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని నిర్ణయించారు. షేక్‌పేట్ నాలా వద్ద పెలికాన్ సిగ్నల్, జీబ్రా క్రాసింగ్‌లను ఏర్పాటు చేయనున్నారు. నానల్ నగర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు వీలుగా అక్కడ ఉన్న రోటరీ వెడల్పును తగ్గించి, రహదారిని విస్తరించాలని అధికారులను ఆదేశించారు. రేతిబౌలి నుంచి నానల్ నగర్ వరకు ఉన్న సెంట్రల్ మీడియన్‌ను, అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి రోడ్డును వెడల్పు చేయనున్నారు. ఎన్‌ఎండీసీ, డెల్ స్టోర్ ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్ ప్రకారం భూసేకరణ చేపట్టి రహదారి విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. రహదారి మధ్యలో ఉన్న రామాలయం ఆర్చ్, బొడ్రాయి, అలాగే షేక్‌పేట్ నాలా సమీపంలోని సమాధులను తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కమిషనర్లు ఆదేశించారు. మాసాబ్ ట్యాంక్ ఫ్లై ఓవర్ వద్ద ఎత్తు పరిమితి బారియర్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. మెహదీపట్నం వైపు ఉన్న ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించి, పోచమ్మ బస్తీ నుంచి రోడ్ నంబర్ 12కు నేరుగా వెళ్లేలా స్లిప్ రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా తక్షణమే చేయదగ్గ పనులు, దీర్ఘకాలిక పనులను గుర్తించామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. నగరంలోని ట్రాఫిక్ పనుల నిమిత్తం ప్రతి జోన్‌కు రూ. 20 కోట్ల చొప్పున మొత్తం రూ. 120 కోట్లు కేటాయిస్తున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ వెల్లడించారు. కేబీఆర్ పార్క్ వద్ద పెండింగ్‌లో ఉన్న పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి.జోయల్ డెవిస్ , జి ముకుంద రెడ్డి , ప్రియాంక ఆలా, కాజల్ , కె. శ్రీనివాస్, ఎస్.రత్నాకర్, వేణుగోపాల్ రెడ్డి, డి. ధనలక్ష్మి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నల్లగొండలో నకిలీ నోట్ల వ్యాపారం

## మాటువేసి దుండుగుడి పట్టివేత

నల్లగొండ,ఏప్రిల్ 9(అడుగు న్యూస్): కష్టపడకుండానే, ఏ పని చేయకుండానే సంపాదించాలనే ధోరణితో కొందరు కేటుగాళ్లు అమాయకులను మోసం చేస్తున్నారు. కొందరు పెట్టుబడుల పేరుతో, ఆన్ లైన్ బెట్టింగ్ పేరుతో మోసం చేస్తుంటే.. ఈ కేటుగాడు లక్ష అసలుకు 5 లక్షల దొంగనోట్లు ఇస్తానని చెప్పి సామాన్యులను మోసం చేస్తున్నాడు. నల్లగొండ జిల్లాలో నకిలీ నోట్లతో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నకిలీ కరెన్సీ తో మోసం చేసిన నిందితుడిని తిప్పర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. అమాయకులను టార్గెట్ చేసి నకిలీ 500 నోట్లతో మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా పరిచయాలు పెంచుకుని నేరాలు పాల్పడుతున్నట్లు తెలిపారు. లక్ష రూపాయల అసలు కరెన్సీకి 5 లక్షల నోట్ల ఆఫర్ పేరుతో మోసం చేసినట్లు చెప్పారు. నల్ల కాగితాన్ని కెమికల్‌తో అసలు నోట్లలా చూపిస్తూ మోసాలకు పాల్పడుతున్నాడు. నోట్ల కట్టలలో పైభాగంలో ఒరిజినల్ నోట్లు లోపల నల్ల కాగితాల కట్టలతో చూపించి మోసం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మల్లేపల్లి వారిగూడేనికి చెందిన వంగూరి జానయ్య మోసానికి గురవడంతో పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు.. ట్రాప్ వేసి తిప్పర్తి రైల్వే స్టేషన్ వద్ద నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడి నుంచి బ్లాక్ కలర్ కాగిత కట్టలు, కెమికల్ బాటిల్ స్వాధీనం చేసుకున్నారు. రెడ్‌మీ మొబైల్ ఫోన్, నాలుగు అసలు 500 నోట్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు సల్మాన్ ఉమా దాలియా అలియాస్ గోయిట సోంగలో అనే వెస్ట్ ఆఫ్రికా, మాలి దేశానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు చెప్పారు. రెండేళ్ల క్రితం భారత్‌కు వచ్చిన నిందితుడు బెంగళూరులో నివసిస్తూ వ్యాపారం చేస్తున్నాడు. నకిలీ కరెన్సీ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, లావాదేవీలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కేసు ఛేదించిన డీఎస్పీ శివరాం రెడ్డి, సీఐ కొండల్ రెడ్డి, ఎస్ఐ వి. శంకర్, సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.

### వరి కొనుగోలు మరో 2 నెలలు పెంచాలి


#### కేంద్రానికి మంత్రి ఉత్తమ్ లేఖ

హైదరాబాద్,ఏప్రిల్ 9(అడుగు న్యూస్): వరి కొనుగోలు సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ రాసారు. ఈ సీజన్‌లో మరో రెండు నెలల గడవు పెంచాలని కోరారు. రబి 2024-25కు 5 లక్ష మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ టార్గెట్ పెట్టాలని..ఎఫ్‌సీఐ రా రైస్ టార్గెట్ తగ్గించాలని సూచించారు మంత్రి ఉత్తమ్. 8.45 లక్ష మెట్రిక్ టన్నుల రైస్ డెలివరీ ఇంకా పెండింగ్ ఉందని.. ఇప్పటికే గడువు ముగిసిన క్రమంలో మరో 60 రోజులు గడువు పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఐదు శాతం బ్రోకెన్స్‌తో బాయిల్డ్ రైస్ సరఫరాకు మిల్లర్ల అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు. 2025-26కు బాయిల్డ్ రైస్ టార్గెట్ 20 నుంచి 40 ఒ.ఎం.టీలకు పెంచాలని డిమాండ్ చేశారు. పెరిగిన ఉత్పత్తికి సరిపడా టార్గెట్లు లేవని రాష్ట్రం ఆందోళనలో ఉందని అన్నారు. కేంద్రం టార్గెట్లు తగ్గించడంతో నిల్వలు పెరుగుతున్నాయని.. రైతులకు భరోసా కల్పించేందుకు నిరంతర కొనుగోలు అవసరం ఉందని.. అదనపు ప్యాడీతో రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు.మరో 2 నెలల గడువు పెంచాలని కోరారు.




# గా మట్టిని సాఫ్ చేయిండ్లిట్ల!?

రాను రాను ఆనలు తక్కువైతానయి. ఎండలెక్కువైతానయి. మోటర్లు ఎక్కువై రోడ్ల మీద గిర్రగిర్ర తిరుగుతానయి. ఇగ దుమ్ము, దుమ్ములేస్తుందనుకోండ్రి. గీ దమ్ముతోటి మస్తు రోగాలొత్తయి. మన దగ్గరున్న వస్తువులు



దుమ్ముకొట్టుకపోతయి. ఇగ మనం శేతుల పట్టుకునుండే ఫోన్లైతే మన్నైతానయి. మరి గవాట్లకెల్లి గా మట్టిని తీసుడెట్ల?
అటు ఇటు కనిపించే ప్లాస్టర్ ను తీసుకోవాలె. గదాన్ని పోన్లల్ల మట్టి బాగా ఉండే మూలల్ల, స్పీకర్ రంద్రాలల్ల మీద తిప్పి పెట్టి, ఒక పుల్లతోటి గా సందుల్ల ఒత్తాలె. తర్వాత కొద్దిసేపటికే గా ప్లాస్టర్ ను తీసేయ్యాలె. గ తీసేసిన ప్లాస్టర్ కి గా మట్టంతా పట్టుకుని ఉంటది. ఎట్లుంది గీ ఇకమతు?

# పాలకుర్తి క్షేత్రంలో మహాద్భుతం

## నందీశ్వరుడి చెంత నాగుపాము సందడి!

పాలకుర్తి, ఏప్రిల్ 9 (అడుగు న్యూస్):
జనగామ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పాలకుర్తి స్వయంభువు శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఒక అరుదైన దృశ్యం భక్తులను పరవశింపజేస్తోంది. గత వారం రోజులుగా ప్రతిరోజూ మధ్యాహ్నం నైవేద్యం



ముగించి ఆలయ ద్వారాలు మూసివేసిన సమయంలో, ఒక నాగుపాము ప్రత్యక్షమవుతూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఆలయ మహా మండపంలోని గర్భగుడి ఎదురుగా ఉన్న నందీశ్వర స్వామి విగ్రహం వద్ద ఈ సర్పం పడగ విప్పి దర్శనమిస్తోంది. కొద్దిసేపు అక్కడే కొలువై ఉండి, అనంతరం సమీపంలోని చెట్ల పొదల్లోకి వెళ్ళిపోతోందని ఆలయ సిబ్బంది వెల్లడించారు. స్వయంభూ చండిక సమేత సోమేశ్వరుడే ఇలా పాము రూపంలో దర్శనమిస్తున్నాడని భక్తులు నమ్ముతున్నారు. ఈ వింతను చూసేందుకు భక్తులు భారీగా తరలివస్తుండటంతో పాలకుర్తి క్షేత్రం భక్తిపారవశ్యంతో నిండిపోయింది. యాదృచ్ఛికమో లేక దైవలీలనో తెలియదు కానీ, నందీశ్వరుడి చెంత నాగుపాము ప్రత్యక్షమవ్వడం ఇప్పుడు స్థానికంగా పెద్ద చర్చనీయాంశమైంది.

# ఉపాధి హామీ పనుల్లో వేగం...

మొదటిపేజీ తరువాయి..

అమలు చేస్తున్నారు. లక్ష్యాన్ని పూర్తి చేయాలంటే ప్రతిరోజు సుమారు 8.50 లక్షల మందికి పని కల్పించాల్సి ఉండగా, ప్రస్తుతం రోజుకు సుమారు 3 లక్షల మంది మాత్రమే పనులకు హాజరవుతున్నారు. దీంతో కమిషనర్ దివ్య దేవరాజన్ జిల్లాల అధికారులతో రోజువారీ సమీక్షలు నిర్వహిస్తూ కూలీల సంఖ్య పెంచే చర్యలు చేపడుతున్నారు.ఎక్కువ మందికి ఉపాధి కల్పించే మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.1000 నగదు ప్రోత్సాహకంతో పాటు సత్కారం అందిస్తున్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా ఫేషియల్ హాజరు నమోదు విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలున్నా వాటిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇక ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఇంకుడు గుంతలు, పిచ్చిమొక్కల తొలగింపు వంటి పనుల్లోనూ కూలీలను విస్తృతంగా వినియోగిస్తున్నారు. మొత్తం మీద ఈ నెలలో లక్ష్య సాధన కోసం అధికారులు వేగంగా ముందుకు సాగుతున్నారు.

# కేఎంసీలో ర్యాగింగ్ కలకలం..

మొదటిపేజీ తరువాయి..

సెకండియర్ విద్యార్థులతో వాట్సాప్ సంభాషణల నేపథ్యంలో ఈ వివాదం తలెత్తినట్లు సమాచారం. దీనిపై ఆగ్రహించిన థర్డ్ ఇయర్ విద్యార్థులు 20 మంది జూనియర్లను హాస్టల్ పైకి పిలిపించి గోడకుర్చీ వేయించి క్షమాపణలు చెప్పించారని ఆరోపణలు ఉన్నాయి. బాధితులు ఈ ఘటనపై పోలీసులతో పాటు నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయడంతో కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ విచారణ చేపట్టి చర్యలు తీసుకుంది.ఇదే సమయంలో బీఎస్సీ రేడియాలజీ విభాగంలో మరో ర్యాగింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. సీనియర్ విద్యార్థులు ఒక జూనియర్‌పై దాడి చేసినట్లు ఆరోపణలు రావడంతో ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య అంతర్గత విచారణకు ఆదేశించారు. మొత్తం మీద కేఎంసీలో వరుస ర్యాగింగ్ ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.

# ఇంటర్ ఫలితాల ప్రకటనపై దుష్ప్రచారాలు

## వదంతులు నమ్మవద్దన్న తెలంగాణ ఇంటర్ బోర్డు

హైదరాబాద్,ఏప్రిల్ 9(అడుగు న్యూస్): తెలంగాణ ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని సోషల్ మీడియాలో తెగ వార్తలు వస్తున్నాయి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. తాజాగా, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రచారాన్ని తెలంగాణ విద్యాశాఖ ఖండించింది. ఈ ప్రచారం అసత్యం, అందులో ఎలాంటి వాస్తవం లేదని తెలిపింది. ఇంటర్ ఫలితాలు ప్రకటన నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే విడుదలవుతాయని విద్యాశాఖ స్పష్టం చేసింది. గతంలో ఇంటర్ ఫలితాలు ఏప్రిల్ మొదటి వారంలో రిలీజ్ కాలేదన్న విషయం గుర్తు చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ 'ఫ్యాక్ట్‌చెక్' విభాగం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ పెట్టింది. గతంలో ఇంటర్ ఫలితాలు విడుదలైన తేదీలు.. 2014 మే 3, 2015 - ఏప్రిల్ 22, 2016 - ఏప్రిల్ 22, 2017 - ఏప్రిల్ 16, 2018 - ఏప్రిల్ 13, 2019 -ఏప్రిల్ 18, 2020 - జూన్ 18 (కోవిడ్ కారణంగా అందరినీ పాస్ చేయటం జరిగింది), 2021-జూన్ 28 (కోవిడ్ కారణంగా అందరినీ పాస్ చేయటం జరిగింది), 2022 - జూన్ 28, 2023 - మే 9, 2024 - ఏప్రిల్ 24, 2025 -ఏప్రిల్ 22 ప్రకటించారు' అని పోస్ట్ చేశారు. ఇక జవాబు పత్రాల మూల్యాంకనం, ఇతర అంశాలను బట్టి ఫలితాల విడుదల అయ్యే తేదీలు ప్రతి ఏటా మారుతుంటాయి. అదే విధంగా, ఈ సంవత్సరం కూడా కొనసాగుతుంది. మూల్యాంకన సమయాన్ని బట్టి, ఫలితాల విడుదల ప్రకటన చేస్తారు. ఇంటర్మీడియట్ ఫలితాల విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా విద్యాశాఖ ఇచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని కోరుతున్నాము. సామాజిక మాధ్యమాలలో ప్రచారమయ్యే తప్పుడు వార్తలను నమ్మ వద్దని తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ పేర్కొంది.



# చెన్నై జట్టును తక్కువ అంచనా వేయలేం

## సన్‌రైజర్స్ స్టార్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్

ఐపీఎల్ 2026 సీజన్ రసవత్తరంగా సాగుతోంది. ఇప్పటికే 13 మ్యాచ్‌లు ముగియగా, జట్ల మధ్య పోరు హోరాహోరీగా మారుతోంది. ఈ క్రమంలో ఏప్రిల్ 18న హైదరాబాద్‌లోని ఉప్పల్ మైదానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ , చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య బిగ్ ఫైట్ జరగనుంది. అయితే ఈ మ్యాచ్‌కు ముందు అందరి ఫోకస్ ఎంఎస్ ధోనీపైనే ఉంది. గాయం కారణంగా ధోనీ ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ స్టార్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ చెన్నై జట్టుపై చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ధోనీ లేకపోవడం సీఎస్‌కే బలాన్ని తగ్గిస్తుందని తాను భావించడం లేదని క్లాసెన్ స్పష్టం చేశారు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ఐపీఎల్‌లో అద్భుతమైన రికార్డు ఉందని, వారు ఎప్పుడూ పటిష్ఠమైన జట్టుగానే బరిలోకి దిగుతారని హెన్రిచ్ క్లాసెన్ పేర్కొన్నారు. “ధోనీ మైదానంలో లేనంత మాత్రాన ఆ జట్టు బలహీనపడదు. వారి సెటప్‌లో ఉన్న ప్రతి ఆటగాడు ప్రతిభావంతుడే. విదేశీ ఆటగాళ్లతో పాటు స్వదేశీ కుర్రాళ్లు కూడా మ్యాచ్‌ను గెలిపించగలరు” అని క్లాసెన్ అభిప్రాయపడ్డారు. జియోస్టార్ ప్రెస్ రూమ్‌లో జరిగిన ఇంటర్వ్యూలో ఆయన సీఎస్‌కే జట్టుపై తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. ధోనీ లేకపోవడం వల్ల తమ పని సులభం అవుతుందని తాము అనుకోవడం లేదని ఆయన తెలిపారు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టును మరో కీలక ఆటగాడి రాకతో మరింత బలం పెరిగినట్లయ్యింది. దక్షిణాఫ్రికా యువ సంచలనం డెవాల్డ్ బ్రెవిస్ గాయం నుంచి కోలుకుని జట్టుతో చేరబోతున్నాడని క్లాసెన్ వెల్లడించారు. ధోనీలాగే బ్రెవిస్ కూడా ప్రాక్టీస్ సెషన్‌లో గాయపడటం వల్ల మొదటి మూడు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. బ్రెవిస్ మిడిల్ ఆర్డర్‌లో వస్తే చెన్నై బ్యాటింగ్ మరింత బలోపేతం అవుతుందని, అది తమ బౌలర్లకు సవాల్‌గా మారుతుందని క్లాసెన్ చెప్పుకొచ్చారు. క్లాసెన్ తన సొంత దేశపు ఆటగాడైన బ్రెవిస్ సామర్థ్యం గురించి మేనేజ్‌మెంట్‌ను హెచ్చరించారు. చెన్నై జట్టు టాప్ ఆర్డర్ గురించి మాట్లాడుతూ క్లాసెన్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ప్రస్తుత కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, కొత్తగా జట్టులో చేరిన సంజు శాంసన్ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో పరుగులు చేయలేదు. అయితే ఇలాంటి క్లాస్ ప్లేయర్లు ఎప్పుడైనా ఫామ్ అందుకునే అవకాశం ఉందని, వారు ఫామ్ లోకి వస్తే ఆపడం చాలా కష్టమని అన్నారు. వారు తమపై జరిగే మ్యాచ్‌లో కూడా ఫెయిల్ కావాలని తాము కోరుకుంటున్నామని, తద్వారా చెన్నైని ఒత్తిడిలోకి నెట్టవచ్చని క్లాసెన్ నవ్వుతూ వ్యాఖ్యానించారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ప్రస్తుతం ప్యాట్ కమిన్స్ అందుబాటులో లేకపోవడంతో ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్‌లలో సన్‌రైజర్స్ కేవలం ఒక్క విజయాన్ని మాత్రమే నమోదు చేసింది. ఇషాన్ కిషన్ నాయకత్వంలో జట్టు మళ్లీ విజయాల బాట పట్టాలని అభిమానులు కోరుకుంటున్నారు. క్లాసెన్ కూడా ఇదే విషయాన్ని నొక్కి చెప్పారు. చెన్నై వంటి పెద్ద జట్లతో ఆడేటప్పుడు గెలవడం ద్వారా జట్టులో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, అందుకే ఏప్రిల్ 18న జరిగే మ్యాచ్ తమకు అత్యంత కీలకమని అన్నారు. ఎంఎస్ ధోనీ మైదానంలో లేకపోయినా అతని ప్రభావం జట్టుపై కచ్చితంగా ఉంటుందని క్లాసెన్ విశ్లేషించారు. “ధోనీ డగౌట్‌లో కూర్చుని తన అనుభవాన్ని కుర్రాళ్లకు షేర్ చేస్తుంటారు. అతని వ్యూహాలు ఎప్పుడూ పనిచేస్తాయి. గత రెండు సీజన్లలో కేవలం ఆఖరి 10 బంతులు మాత్రమే ఆడుతూ వచ్చాడు. కాబట్టి అతను లేకపోవడం బ్యాటింగ్ పరంగా పెద్ద లోటు కాకపోవచ్చు, కానీ మెంటార్‌గా ఆయన ఇచ్చే సూచనలే డేంజరస్” అని క్లాసెన్ తెలిపారు.

## ఐపీఎల్‌లో సరికొత్త రూల్!

సాధారణంగా ఐపీల్ మ్యాచ్‌ల సమయంలో డగౌట్‌లో ఉండే ఆటగాళ్లు పదే పే మైదానంలోకి రావడం చూస్తూనే ఉంటాం. డ్రింక్స్ అందించడానికో, బ్యాట్లు మార్చడానికో, లేదా కోచ్ చెప్పే సమాచారాన్ని చేరవేయడానికో వస్తూ ఉంటారు. అయితే దీని వల్ల మ్యాచ్ సమయం వృథా అవుతుందని గ్రహించిన బీసీసీ సరికొత్త రూల్స్ తీసుకొచ్చింది. ఇందులో భాగంగా మ్యాచ్ ప్లేయింగ్ కండిషన్స్‌లో మార్పులు చేసింది. బీసీసీఐ తాజాగా ఫ్రాంచైజీలకు పంపిన సమాచారం ప్రకారం... మ్యాచ్ ప్రారంభానికి ముందు ఇచ్చిన టీమ్ షీట్‌లో చెప్పిన 16 మంది ఆటగాళ్లకు మాత్రమే అంటే 11మంది జట్టు సభ్యులు ఐదుగురు సబ్‌స్టిట్యూట్లకు మాత్రమే మైదానంతో సంబంధం ఉంటుంది. ఈ 16 మందిలో లేని మిగతా స్క్వాడ్ సభ్యులలు ఎవరూ కూడా ఆట జరుగుతున్న సమయంలో మైదానంలోకి అడుగు పెట్టడానికి లేదు. సాధారణంగా రిజర్వ్ ప్లేయర్లు డ్రింక్స్ లేదా సమాచారాన్ని తీసుకెళ్తుంటారు. కానీ కొత్త రూల్స్ ప్రకారం టీమ్ షీట్‌లో లేని



ఆటగాళ్లు డ్రింక్స్, బ్యాట్లు లేదా ఎలాంటి సందేశాలు పట్టుకొని రావడానికి లేదు. మ్యాచ్ జరుగుతున్న టైంలో కేవలం ఐదుగురు సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు మాత్రమే మైదానం చుట్టూ తిరగడానికి అనుమతి ఉంటుంది. మిగిలిన వారు కచ్చితంగా డగౌట్‌కే పరిమితం కావాలి. వారు బౌండరీ లైన్, ఎల్ఈడీ అడ్వర్టైజింగ్ బోర్డుల మధ్య తిరగడానికి లేదు. మైదానం లోపల లేదా బౌండరీ పరిసరాల్లో ఉండే సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు కచ్చితంగా టీమ్ ట్రైనింగ్ బిబ్స్ ధరించాలి. ఇది వారి ఆడుతున్న ఆటగాళ్ల నుంచి వేరుగా గుర్తించడానికి సహాయపడుతుంది. ఈ కొత్త మార్పులు ఇప్పటికే ఉన్న మ్యాచ్ ప్లేయింగ్ కండిషన్స్‌లోని క్లాజ్ 11.5.2, 24.1.4లకు అదనంగా చేర్చారు. క్లాజ్ 11.5.2 ప్రకారం వికెట్ పడినప్పుడు లేదా బౌండరీ వద్ద మాత్రమే సమయం వృథా కాకుండా డ్రింక్స్ అందించాలి. అంపైర్ల అనుమతి లేకుండా కూల్స్ డ్రింక్స్ మైదానంలోకి తీసుకురాకూడదు. క్లాజ్ 24.1.4 ప్రకారం మ్యాచ్‌లో ఆడని ఆటగాళ్లు మైదాన ప్రాంతంలో ఉన్నప్పుడు తప్పనిసరిగా బిబ్స్ ధరించాలని స్పష్టం చేస్తుంది. ఈ రూల్ వల్ల జట్ల వ్యూహాలై ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా క్లిష్ట సమయంలో డగౌట్ నుంచి ఆటగాళ్లు సందేశాలు పంపడం ఇప్పుడు కొంత కష్టతరం కావచ్చు. కేవలం నిర్ణీత 16 మంది ద్వారానే కమ్యూనికేషన్ జరగాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈ ఆదేశాలను ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ అన్ని ఫ్రాంచైజీలకు చేరవేసింది.

## డేవిడ్ మిల్లర్‌కు అండగా సునీల్ గవాస్కర్

ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్ బ్యాటర్ డేవిడ్ మిల్లర్‌కు భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ అండగా నిలిచారు. మ్యాచ్ గెలిపించాలనే అతని ఉద్దేశాన్ని తప్పుబట్టలేమని సన్నీ అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా గుజరాత్ టైటాన్స్‌తో బుధవారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఒక్క పరుగు తేడాతో ఓటమిపాలైన సంగతి తెలిసిందే. ఢిల్లీ విజయానికి చివరి రెండు బంతుల్లో రెండు పరుగులు అవసరం కాగా.. ఐదో బంతిని లెగ్ సైడ్‌కు ఆడిన డేవిడ్ మిల్లర్ సింగిల్‌కు నిరాకరించాడు. దాంతో నాన్ స్ట్రైకర్ కుల్దీప్ యాదవ్ క్రీజు వరకు వచ్చి వెనక్కి వెళ్లిపోయాడు. ఆఖరి బంతిని మిల్లర్ కనెక్ట్ చేయలేకపోవడంతో సింగిల్‌కు ప్రయత్నించిన కుల్దీప్ యాదవ్ రనౌట్ అయ్యాడు. దాంతో గెలవాల్సిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఒక్క పరుగు తేడాతో ఓటమిపాలైంది. డేవిడ్ మిల్లర్ చేసిన తప్పిదం కారణంగానే ఢిల్లీ క్యాపిటల్స్ ఓటమిపాలైం దని అతనిపై ఫ్యాన్స్ మండిపడ్డారు. మిల్లర్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని కూడా ఆరోపించారు. మిల్లర్ ఆ సింగిల్ తీసి ఉంటే మ్యాచ్ డ్రా అయ్యేదని, ఆ తర్వాత కుల్దీప్ అయినా సూపర్ ఓవర్‌కు దారి తీసేదని ఫ్యాన్స్ అభిప్రాయప డ్డారు. ఈ మ్యాచ్‌లో డేవిడ్ మిల్లర్ గాయంతోనే ఆడి 20 బంతుల్లో 41 పరుగులతో అజేయంగా నిలిచి ఢిల్లీ క్యాపిటల్స్‌ను గెలుపు అంచులకు చేర్చినప్పటికీ, చివరి అడుగులో తడబడ్డాడు. అయితే మిల్లర్‌పై వస్తున్న విమర్శలను సునీల్ గవాస్కర్ తప్పుబట్టారు. సూపర్ ఫామ్‌లో ఉన్న మిల్లర్.. మ్యాచ్‌ను తానే పూర్తి చేయగలనని నమ్మాడని గవాస్కర్ అభిప్రాయపడ్డారు.

# ముకుల్ మ్యాజిక్

## లఖ్‌నవూ థ్రిల్లింగ్ విజయం.. చివరి బంతి వరకు ఉత్కంఠ!

ఐపీఎల్‌లో ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ అద్భుత విజయం సాధించింది. చివరి బంతి వరకు నరాలు పగిలే పోరులో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 3 వికెట్ల తేడాతో గెలిచింది. ఈ విజయానికి ప్రధాన కారణం యువ బ్యాటర్ ముకుల్ చౌధరి. 21 ఏళ్ల ఈ ఆటగాడు 27 బంతుల్లో 54 పరుగులు చేసి మ్యాచ్‌ను ఒంటిచేత్తో మలుపుతిప్పాడు. ఏడు సిక్సర్లు, రెండు ఫోర్లతో అతని దూకుడు కేకేఆర్ బౌలర్లను కంగుతినిపించింది. మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతా 20 ఓవర్లలో 181/4 పరుగులు చేసింది. రఘువంశీ (45), రహానే (41), పోవెల్ (39 నాటౌట్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడగా, చివర్లో గ్రీన్ (32 నాటౌట్) వేగం పెంచాడు. లఖ్‌నవూ బౌలర్లు మధ్య ఓవర్లలో పట్టు సాధించినా, డెత్ ఓవర్లలో కోల్‌కతా దూసుకెళ్లింది. లక్ష్య ఛేదనలో లఖ్‌నవూ ప్రారంభంలో బాగానే ఆడినా, వరుస వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో



పడింది. బదోని (54) పోరాడినా, కీలక సమయంలో అవుట్ కావడంతో మ్యాచ్ కేకేఆర్ వైపు వెళ్లినట్టే కనిపించింది. కానీ ముకుల్ అద్భుత ప్రదర్శనతో కథ మారిపోయింది. చివరి ఓవర్లో అవసరమైన పరుగులు సిక్సర్లతో సాధించి, ఆఖరి బంతికి సింగిల్ తీసి జట్టుకు విజయం అందించాడు. ఈ ఇన్నింగ్స్‌కు గాను అతడు ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’గా నిలిచాడు.






## డెకాయిట్ బ్లాక్ బస్టర్ అందుకోవాలి

### సుప్రియను అభినందిస్తూ సమంత పోస్ట్

కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియాలో ’డెకాయిట్’ సందడి కనిపిస్తోంది. అడివి శేష్ హీరోగా షానియల్ డియో తెరకెక్కించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో టీమ్‌కు అందరూ ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు. తాజాగా నటి సమంత టీమ్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ చిత్ర నిర్మాత సుప్రియను ఉద్దేశించి ఇన్‌స్టాలో స్టోరీ పెట్టారు. ‘సుప్రియ.. ’డెకాయిట్’ కోసం నువ్వు పడిన కష్టం, నీ పట్టుదల, సినిమాపై నీకున్న అంకితభావం అన్నీ నేను స్వయంగా చూశాను. బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడానికి నీకంటే ఎవరూ అర్హులు కారు. దేవుడి ఆశీస్సులు నీకు ఎప్పుడూ ఉండాలి‘ అని సమంత అన్నారు. ’డెకాయిట్’ విజయం సాధించాలని కోరుకుంటూ టీమ్‌కు ముందుగానే శుభాకాంక్షలు తెలిపారు. రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. శేష్ సరసన మృణాల్ నటించగా.. బాలీవుడ్ నటుడు, దర్శకుడు అనురాగ్ కశ్యప్ విలన్‌గా కనిపించనున్నారు. విడుదల తేదీ ప్రకటించిన నాటినుంచి చిత్రబృందం జోరుగా ప్రచారం చేసి సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. టీజర్, ట్రైలర్ ఆకట్టుకునేలా ఉండడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి.



## పెద్దిలో పాట కోసం నాయికాన్వేషణ

రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ’పెద్ది’ సినిమాలోని ప్రత్యేకగీతాన్ని త్వరలోనే తెరకెక్కించనున్నారు. అందుకు సంబంధించిన సన్నాహాలు ఊపందుకున్నాయి. ఆ గీతంలో రామ్‌చరణ్‌తో కలిసి ఆడిపాడే కథానాయికని ఎంపిక చేయడంపై చిత్రబృందం దృష్టిపెట్టింది. ఇప్పటికే పలువురు కథానాయికల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. తాజాగా... తెలుగమ్మాయి మానస వారణాసి కూడా ఈ రేసులోకి వచ్చింది. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన ’కపుల్ ఫ్రెండ్లీ’ సినిమాతో ఆకట్టుకున్నారు మానస వారణాసి. చిత్రబృందం పరిశీలనలో ఆమె పేరు ఉన్నట్టు తెలుస్తోంది. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ’పెద్ది’ తెరకెక్కుతోంది. జాన్వీకపూర్ కథానాయిక. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పిస్తున్నాయి.

## రాకాలో అల్లు ద్విపాత్రాభినయనం

### రమ్యకృష్ణ కూడా కీ రోల్

అల్లు అర్జున్ నటిస్తున్న ’రాకా’ చిత్రం ప్రస్తుతం సినీ రంగంలో సంచలనంగా మారింది. దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల కావడంతోనే భారీ చర్చ మొదలైంది. విడుదలైన ఫస్ట్ లుక్‌లో అల్లు అర్జున్ పూర్తిగా కొత్తగా కనిపించారు. ముందు గుండు, వెనుక కొద్దిగా జుట్టుతో, ముఖాన్ని చేతులతో కప్పుకున్న తీరు భయానకంగా, రహస్యంగా ఉంది. సగం మనిషి, సగం తోడేలు స్వరూపంలో కనిపించనున్నట్టు ఈ చిత్రం సూచిస్తోంది. ఈ చిత్రంలో దీపిక పదుకొణెళి ప్రధాన కథానాయికగా నటిస్తోంది. ఆమె పాత్ర యోధురాలిగా ఉంటుందని సమాచారం. మరోవైపు రమ్యకృష్ణన్ కూడా కీలక పాత్రలో కనిపించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్ ఫస్ట్ లుక్‌పై స్పందించిన రమ్యకృష్ణ.. ‘పరిధులను దాటి వెళ్లే అనుభవానికి సిద్ధంగా ఉండండి‘ అని చెప్పడం ఆమె పాత్రపై మరింత ఆసక్తిని పెంచింది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ రెండు పాత్రల్లో కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఒకటి నాయక పాత్ర కాగా, మరొకటి ప్రతినాయక స్వభావం కలిగిన పాత్రగా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం విడుదలైన రూపం ప్రతినాయక పాత్రధారని చెబుతున్నారు. ఈ చిత్రంలో ఒకరి కంటే ఎక్కువ కథానాయికలు ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. సమంత రూత్ ప్రభు, రష్మిక మంధాన పేర్లు వినిపిస్తున్నప్పటికీ



దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. ఇక ’రాకా’ అనే పదానికి రాక్షసుడు, పౌర్ణమి చంద్రుడు వంటి అర్థాలున్నాయి. ఈ చిత్రంలో నాయకుడి లోపల ఉన్న చీకటి, విధ్వంసక శక్తిని చూపించేలా ఈ పేరును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. విజ్ఞానకథాంశం, అసాధారణ శక్తుల నేపథ్యంతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని యోచిస్తున్నారు.

## నేషనల్ సినీ అకాడమీ అవార్డ్స్

### ఉత్తమ నటులుగా నాగచైతన్య, రష్మిక

భారతీయ సినీ పరిశ్రమలో ప్రతిష్టాత్మకంగా భావించే ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ అవార్డ్స్ 2026 విజేతలను ప్రకటించారు. ప్రతి ఏడాది దేశంలోని పలు భాషల చిత్ర పరిశ్రమలను ఒక వేదికపైకి తీసుకువచ్చే ఈ అవార్డులు, ఈసారి కూడా విశేష ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తెలుగు విభాగంలో యువసామ్రాట్



నాగచైతన్య ’తండేల్’ సినిమాలో తన నటనకు గాను ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. అలాగే రష్మిక మందన్న ’ది గర్ల్‌ఫ్రెండ్’ సినిమాతో ఉత్తమ నటిగా అవార్డు అందుకోనుంది. ఇప్పటికే ఈ ఇద్దరూ తెలంగాణ గద్దర్ అవార్డ్స్‌లో ఉత్తమ నటీనటులుగా గుర్తింపు పొందగా, ఇప్పుడు ఎఔఅంలో కూడా అదే కేటగిరీలో విజేతలుగా నిలవడం విశేషం. ఇక తెలుగు విభాగంలో ఉత్తమ దర్శకుడిగా అనిల్ రావిపూడి ’సంక్రాంతికి వస్తున్నాం’ చిత్రానికి గాను ఎంపికయ్యారు. అదే సినిమాలో నటించిన మాస్టర్ రేవంత్ (బుల్లిరాజు)కు ఉత్తమ హాస్యనటుడిగా అవార్డు లభించింది. హీరో తేజ సజ్జా నటించిన మిరాయ్ ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఈ సినిమాకే బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలోనూ అవార్డు రావడం విశేషం. ఉత్తమ తొలి చిత్ర దర్శకుడిగా రామ్ జగదీష్ (’కోర్ట్’) ఎంపికయ్యారు. ఇతర భాషల్లో కూడా పలువురు ప్రముఖులు అవార్డులు సొంతం చేసుకున్నారు. తమిళంలో దుల్కర్ సల్మాన్ ఉత్తమ నటుడిగా, సిమ్రాన్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. కన్నడలో రిషబ్ శెట్టి ’కాంతార: చాప్టర్ 1’ చిత్రంతో ఉత్తమ నటుడు, దర్శకుడు అవార్డులు అందుకోగా, అదే సినిమా ఉత్తమ చిత్రంగా కూడా నిలిచింది. మలయాళంలో నివిన్ పౌలీ ఉత్తమ నటుడిగా నిలిచారు. హిందీలో రణవీర్ సింగ్ ఉత్తమ నటుడిగా, యామీ గౌతమ్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఏప్రిల్ 16న ముంబైలో జరగనుంది. ఈ వేడుకకు టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటి మరియు బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ హోస్టులుగా వ్యవహరించనున్నారు. సీనియర్ నటి రేఖ, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.



Printed, Published & Owned by Margam Rama on behalf of ADUGU DIGITAL MEDIA Pvt. Ltd, Printed and Published at ADUGU PRESS, H No: 7-120, PALAKURTHI Village & Mandal, Jangaon District, Telangana, PIN: 506146. Chief Editor: Dr.Margam Lakshmi Narayana, Ph.No. : 8499990005